సాక్షి నిర్మల్

శనివారం : 26 : జూలై : 2025



రైతన్నా.. జర భద్రం

పురుగుమందులంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు, వ్యసాయ కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. 8లో▸

'కడెం'కు పెరిగిన వరద



కడెం: కడెం ప్రాజెక్టుకు శుక్రవారం రాత్రి 5,983 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,414 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700 అడుగులు. ప్రస్తుతం 695.200 అడుగులు ఉంది.

గరిష్టం/కనిష్టం

24.4 /24.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా హరికిరణ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధి ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ప్రత్యేక అధికారిగా ఆయా జిల్లా కలెక్టర్లతో పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు పని చేయనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా ఇలంబర్తి పని చేయగా, ప్రస్తుతం ఆయన స్థానంలో హరికిరణ్ నియమితులయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా పీఎం జన్‌మన్ పథకం కింద ఒప్పంద ప్రాతిపదికన మొబైల్ మెడికల్ యూనిట్‌లో వైద్య అధికారులు (01), ల్యాబ్ టెక్నీషియన్ (01), పారామెడిక్ -కం- అసిస్టెంట్ (01), స్టాఫ్ నర్స్ (01) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు www.nirmal.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత అర్హత పత్రాలు జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉన్నట్లు పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో నిర్మించే విద్యుత్ సబ్ స్టేషన్‌కు అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ శుక్రవారం స్థల పరిశీలన చేశారు. రైతులను కలిసి మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కళాశాల తనిఖీ

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో జాదవ్ పరశురాం శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

జాగ్రత్తలే రక్ష



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

కడెం: ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినపుడు చిన్నపాటి జాగ్రత్తలతో ప్రాణాలు రక్షించుకోవచ్చని ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ వినీత్‌కుమార్ అన్నారు. కడెం ప్రాజెక్టు దిగువ ప్రాంతాలైన కడెం, కొండుకూర్, కన్నాపూర్ గ్రామాల్లో ప్రకృతి విపత్తులు, రక్షణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వరదలు, రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, ఆర్‌ఐ శారద, సీనియర్ అసిస్టెంట్ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శులు భూమేశ్, అరుణ, మునిరుల్‌హసన్, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్జీయూకేటీ కెరీర్ గైడెన్స్



హాజరైన విద్యార్థినులు

బాసర: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ఇంజనీరింగ్ మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఇంజనీరింగ్ తర్వాత భవిష్యత్ కార్యాచరణపై కళాశాల అధికారులు అవగాహన కల్పించారు. గేట్/ఈఎస్ఈ/పీఎస్‌యూ కోచింగ్ గురించి ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అకాడమీ ఫ్యాకల్టీ మోహన్‌త్రినాథ్ అవగాహన కల్పించారు. టైం మేనేజ్‌మెంట్, ప్రిపరేషన్ స్ట్రాటజీస్, సాఫ్ట్ స్కిల్స్, ప్రొఫెషనల్ ఎథిక్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, డీన్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ డాక్టర్ చంద్రశేఖర్, ట్రిపుల్‌ఈ హెచ్‌వోడీ భావసింగ్, స్టూడెంట్ కౌన్సిలర్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కొత్త ఓటరు జాబితా!



- గ్రామం యూనిట్‌గా రూపకల్పన
- ఇప్పటికే మండలం యూనిట్‌గా పూర్తి
- ఎంపీడీవోల లాగిన్ నుంచి టీపోల్‌లో అప్‌లోడ్
- సిద్ధమవుతున్న పంచాయతీ అధికారులు



చించోలి(బి) గ్రామపంచాయతీ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా గ్రామం యూనిట్‌గా ఓటరు జాబితా తయారీకి పంచాయతీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మండలస్థాయిలో ఓటరు జాబితా రూపొందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పుడు వార్డుల వారీగా గ్రామస్థాయిలో జాబితా రూపొందించనున్నారు. జిల్లాలో 2023 పార్లమెంట్ ఎన్నికల జాబితా ప్రకారం 4,50,045 మంది ఓటర్లు ఉన్నారు. ఈ కొత్త ప్రక్రియ గ్రామీణ ఎన్నికల పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచుతుంది.

కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే వార్డులో..

గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కుటుంబ సభ్యుల ఓట్లు వివిధ వార్డుల్లో చెల్లాచెదురుగా ఉండటంతో సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యను నివారించేందుకు, ఈసారి కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా జాబితా తయారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ చర్య ఓటర్లకు సౌలభ్యం కల్పించడంతోపాటు, ఎన్నికల ప్రక్రియలో గందరగోళాన్ని తగ్గించనుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ జాబితా తయారీ బాధ్యతను నిర్వహిస్తారు.

మార్పులు, చేర్పులకు అవకాశం..

జిల్లాలో 400 గ్రామ పంచాయతీలలో 4.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదైనవారితోపాటు, కొందరు చనిపోయిన వారి పేర్లను తొలగించే ప్రక్రియ కూడా జరుగుతుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. ఈ మార్పులన్నీ పరిగణనలోకి తీసుకుని, గ్రామస్థాయిలో కచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం కానుంది.

జిల్లా వివరాలు..	
మొత్తం మండలాలు	18
గ్రామపంచాయతీలు	400
వార్డుల సంఖ్య	3,368
ఎంపీటీసీ స్థానాలు	157
జెడ్పీటీసీ స్థానాలు	18
పోలింగ్ కేంద్రాలు	3,368
మొత్తం ఓటర్లు	4,50,045
మహిళా ఓటర్లు	2,35,775
పురుష ఓటర్లు	2,14,255
ఇతర ఓటర్లు	15

మండలస్థాయి నుంచి గ్రామస్థాయికి..

ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహకంగా, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పంచాయతీరాజ్ శాఖ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఓటరు జాబితాను సిద్ధం చేసింది. ఆయా గ్రామాల్లో వార్డుల వారీగా జాబితా రూపొందించి, ఎంపీడీవోలకు అందజేశారు. ఎంపీడీవోలు తమ లాగిన్ ద్వారా ఈ జాబితాను టీ-పోల్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే, ఇప్పుడు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, వార్డుల వారీగా మరింత కచ్చితమైన జాబితా తయారీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ జాబితాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిద్ధం చేసి, ఎంపీడీవోల ద్వారా డీపీవోకు సమర్పిస్తారు.

'పరిషత్' ఎన్నికలకూ..

ప్రస్తుతం తయారు చేసే గ్రామస్థాయి ఓటరు జాబితా, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఉపయోగపడనుంది. ఈ జాబితా కచ్చితత్వం కోసం, గ్రామంలోని మొదటి వార్డు నుంచి చివరి వార్డు వరకు జాగ్రత్తగా రూపొందించనున్నారు. ఈ ప్రక్రియ ఎన్నికల్లో పారదర్శకతను పెంచుతుంది.

లక్ష్యంతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు..!

- రూర్బన్ నిధులు వృథా
- గ్రామీణాభివృద్ధిలో విఫలం
- పట్టించుకోని అధికారులు



అలంకారప్రాయంగా ఉన్న మార్కెట్ యార్డ్



కల్లూరులో మూసి ఉన్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సౌకర్యాలతో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్యాం ప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్‌ను ప్రారంభించింది. కుంటాల మండలాన్ని 2017 ఆగస్టులో మూడో విడతలో రూర్బన్ మండలంగా ఎంపిక చేసింది. రూ.100 కోట్ల నిధులు కేటాయించింది. అయితే, నిర్వహణ లోపాలు, పర్యవేక్షణ లేకపోవడంతో ఈ నిధులతో చేపట్టిన పనులు వృథాగా మారాయి.

నిర్మించినా నిరుపయోగం..

మండలంలోని గ్రామాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. స్థానిక మార్కెట్ సౌకర్యాలు లేకపోవడంతో నిర్మల్, భైంసా పట్టణాలకు తరలిస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు కుంటాలలో రూ.43 లక్షలు, విఠాపూర్, లింబా(కె), దౌనెల్లి, కల్లూరు, అంబకంటి గ్రామాల్లో రూ.7 నుంచి రూ.9 లక్షల వరకు వెచ్చించి మార్కెట్ యార్డులు నిర్మించారు. అయినప్పటికీ, ఈ యార్డులు నిరుపయోగంగా మారాయి. కల్లూరు, కుంటాలలో రోడ్లపైనే సంత నిర్వహిస్తున్నారు. మార్కెట్ యార్డులు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి.

అలంకారప్రాయంగా దాల్ మిల్లులు..

మండలంలోని అంబుగామ, కుంటాల గ్రామాల్లో రూ.10 లక్షల వ్యయంతో దాల్ మిల్లులను ఏర్పాటు చేశారు. ఈ మిల్లులు స్థానిక రైతులకు ఆదాయ మార్గాన్ని సృష్టించాలన్న లక్ష్యం విఫలమైంది. నిర్మాణం పూర్తయినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

నెలకే మూతపడిన మిల్క్ కూలింగ్ పాయింట్..

ఇక కల్లూరు గ్రామంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో బల్క్ మిల్క్ కూలింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అయితే, ఇది కేవలం ఒక నెల మాత్రమే పనిచేసింది. యంత్రాలు చెడిపోవడంతో మూతపడింది. ఆరు నెలలు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడంతో, స్థానిక పాడి రైతులు పాలను నిర్మల్, భైంసా, దేగాం కేంద్రాలకు తరలిస్తున్నారు.

నిర్మించినా నిరుపయోగమే..



గ్రామంలోని రైతులు పండించిన కూరగాయలను భైంసా మార్కెట్‌కు తరలించేవారు. గ్రామంలో మార్కెట్ యార్డ్ నిర్మిస్తే సంతోషపడ్డాం. వినియోగంలో లేక నిరుపయోగంగా మారింది.

– రాజు, విఠాపూర్

పాడి రైతులను ఆదుకోవాలి...



పాడి పరిశ్రమను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాం. కల్లూరులో బల్క్ మిల్క్ సెంటర్ ఏర్పాటుచేసిన నెలకే మూత పడింది. పాల కేంద్రాన్ని తెరిపించి సమస్య పరిష్కరించాలి.

– విగ్నేష్, యువరైతు, సూర్యాపూర్

ఉన్నతాధికారుల దృష్టికి..

రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రూర్బన్ పథకంలో మార్కెట్ యార్డ్‌లు, దాల్‌మిల్ ఏర్పాటు చేశారు. త్వరలో వాటిని పరిశీలించి ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లి, మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం.

– గౌరీశ్, పీఆర్ ఏఈ

విలువలతో కూడిన విద్యను అందించాలి

- డీఈవో రామారావు

కుంటాల: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కాంప్లెక్స్ సమావేశానికి శుక్రవారం హాజరై మాట్లాడారు. బోధన ప్రక్రియలో భాగంగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌పై మానిటరింగ్ చేశారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలను బోధించి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, ఏఎంవో నర్సయ్య, హెచ్‌ఎంలు రాజేశ్వర్, చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయిని బట్టి బోధించాలి

లోకేశ్వరం: విద్యార్థుల స్థాయిని బట్టి పాఠాలు బోధించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని మన్మద్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి శుక్రవారం హాజరై మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. పాఠశాలలో నిర్వహించే కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్ పద్ధతిలో విద్య బోధించాలన్నారు. పాఠశాలకు అందించిన లైబ్రరీ బుక్‌లను విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశంలో పోక్సోపై చట్టం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక, టీచర్ డైరీ, టీఎల్ఎంలను తప్పనిసరిగా పాఠశాలలో నిర్వహించాలన్నారు. డీఈవో వెంట ఎంఈవో చంద్రకాంత్, జిల్లా కోర్డినేటర్ నర్సయ్య, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రామారావు

అర్హులకు కొత్త రేషన్ కార్డులు

- కలెక్టర్ అభిలాష అభినవ్

తానూరు (ముథోల్): అర్హులైన పేదలందరికీ కొత్తగా రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీ చేస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ముథోల్ మండల కేంద్రంలోని రైతువేదికలో స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి శుక్రవారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ముథోల్ నియోజకవర్గంలో 11,352 నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 17,609 మంది కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులు జరిగాయన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల పంపిణీ చాలా సంతోషకరమైన విషయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రేషన్ బియ్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎస్‌వో రాజేందర్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే రామారావుపటేల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి

పకడ్బందీగా జీపీవో, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 27న(ఆదివారం) నిర్వహించే గ్రామ పాలన అధికారులు(జీపీవో), లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక పరీక్షలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీపీవో పరీక్ష నిర్వహణకు పట్టణంలోని చాణక్య పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, మొత్తం 55 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులను ఉదయం 10 గంటలలోపు కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఈ పరీక్షకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 85 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఏడీ సర్వే – ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఆర్.సుదర్శన్, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, పర్యవేక్షకులు మోతీరాం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు

- హార్టికల్చర్ అధికారి మౌనిక

లక్ష్మణచాంద: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ అధికారి మౌనిక తెలిపారు. మండలంలోని వడ్యాల్ రైతువేదికలో కనకాపూర్ క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వాణిజ్య పంట అయిన ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయిల్‌పామ్ రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్‌లపై 100 శాతం సబ్సిడీ ఉందని, ఇతర రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. మొక్కలు నాటు కోవడానికి ఉపాధిహామీ కూలీలను వినియోగించుకోవచ్చని సూచించారు. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంట చేతికి వచ్చే వరకు అంతర పంటలతో పాటు ప్రభుత్వం తరపున ఎకరానికి ఏటా రూ.4,200 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. నిర్మల్ జిల్లాలోని మాదాపూర్ వద్ద ఫ్యాక్టరీ కూడా నిర్మాణం అవుతుందని తెలిపారు. పంట చేతికి వచ్చిన తర్వాత కంపెనీ వారే రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తారని వెల్లడించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. మండలంలోని ప్రతీ క్లస్టర్‌కు 20 ఎకరాల టార్గెట్ ఉందని ఆసక్తి ఉన్నవారు తమను సంప్రదించాలని తెలిపారు. ఇందులో ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.



సత్తనపల్లిలో ఆయిల్‌పామ్ గెలల సమీకరణ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఉద్యాన అధికారి

ఆయిల్‌పామ్ గెలల కేంద్రం సందర్శన

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ఆయిల్‌పామ్ గెలల సమీకరణ కేంద్రాన్ని ఉద్యాన శాఖ అధికారి స్పందన శుక్రవారం సందర్శించారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు గెలల దిగుబడి వస్తే సత్తనపల్లిలోని కేంద్రంలో అందజేయాలన్నారు. గెలలు అందజేసిన వారం రోజుల తర్వాత డబ్బులు సంబంధిత రైతుల ఖాతాలో జమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వనోజ్, క్లస్టర్ అధికారి దినేశ్ పాల్గొన్నారు.

నిర్మల్‌లో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రికి డీసీసీ చీఫ్ వినతి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విన్నవించారు. సచివాలయంలో శుక్రవారం మంత్రిని కలిశారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను రైతులు అధిక మొత్తంలో సాగుచేస్తున్నారని తెలిపారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ సమీపంలో పరిశ్రమ నిర్మాణానికి 40 ఎకరాల భూ సేకరణ జరిగిందని పేర్కొన్నారు. పరిశ్రమను ఇతర జిల్లాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల శ్రేయస్సు కోసం జిల్లాలోనే పరిశ్రమ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, నరేష్ రెడ్డి ఉన్నారు.



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న డీసీసీ చీఫ్ శ్రీహరిరావు, నాయకులు

ఎరువుల దుకాణాలు తనిఖీ

నిర్మల్ రూరల్: మండలంలోని ఎరువుల దుకాణాలను రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనరేట్ నుంచి వచ్చిన స్పెషల్ ఆఫీసర్, జేడీఏ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని చిట్యాల, మంజులాపూర్, కొండాపూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వలు, విక్రయాల రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి అమ్మొద్దని సూచించారు. రైతులకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని పేర్కొన్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు అవసరాన్ని బట్టి కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో వసంత్ ఉన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు

కుంటాల: రసాయన ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆకా జీఎం వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండలంలోని కల్లూరు, కుంటాలలో ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తామని, రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఏవో అంజి ప్రసాద్, ఏడీఏ విద్యాసాగర్, ఆకా మేనేజర్ ఉమాపతి, ఏవో విక్రమ్ తదితరులు ఉన్నారు.



తనిఖీ చేస్తున్న వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

తొమ్మిది కిలోమీటర్లు నడిచి వైద్యసేవలు



కాలినడకన మందులతో వెళ్తున్న కృష్ణ, రేణుక

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పీహెచ్‌సీ హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక శుక్రవారం మారుమూల గిరిజన గ్రామాలైన బుర్సిగుట్ట, ధర్మాజీపేట్‌కు సుమారు తొమ్మిది కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. ఆయా గ్రామాల ప్రజలకు వైద్యం అందించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మరో తొమ్మిది మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, చేతిపంపుల నీరే తాగాలని సూచించారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా సంపత్‌కుమార్



పీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సంపత్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డీపీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సంపత్ కుమార్‌కు ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన ఐటీడీఏలోని ఏపీఆర్వో ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పీవో ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలపై గిరిజనులను అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

తెగిన చింతగూడ మట్టి రోడ్డు



కొట్టుకుపోయిన రోడ్డు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి లక్కారం నుంచి చింతగూడకు వెళ్లే మట్టి రోడ్డు వర్షానికి తెగి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పెద్ద గుంత ఏర్పడగా ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ జైవంత్‌రావు స్వయంగా తెగిన రోడ్డు గుంత చుట్టూ బండరాళ్లతో సూచిక ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే గుంత పూడ్చి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

రైతన్నా.. జర భద్రం

- రసాయనిక ఎరువులతో జాగ్రత్త
- పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయమే
- అప్రమత్తతే అన్ని విధాలా మేలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పురుగుమందులంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా.. వాటి వాసన పీల్చినా ఆరోగ్యానికి హానికరమే. పంటలపై పురుగుమందులు పిచికారీ చేయడంలో అవగాహన లేకపోవడం.. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది పంటకు పురుగుమందు పిచికారీ చేసి ఇంటికి వచ్చి విషప్రభావంతో వేర్వేరు చోట్ల నలుగురు మరణించారు. వేర్వేరు ఘటనల్లో మరో 18 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు ప్రతీ సీజన్‌లో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం పత్తి, సోయా, కంది చేన్లకు కలుపు, చీడపీడల నివారణకు రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. పంటకు హాని జరుగుతుందన్న ఏమరుపాటులో రైతులు, వ్యవసాయ కూలీలు వ్యక్తిగత జాగ్రత్తలు మరిచిపోతున్నారు. ప్రాణాంతకమైన రసాయనిక మందుల వినియోగం విషయంలో ఏమరుపాటు వద్దని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే మేలని సూచించారు.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగుమందు ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి.



నెన్నెలలో పత్తి చేనులో క్రిమిసంహార మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి. సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలు డాక్టర్‌కు తెలుపాలి.

అవసరమైన పరికరాలు వాడాలి

పంటలకు పురుగుమందులు వాడడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లనే వాడాలి. ముఖ్యంగా పంటలో మొక్కల స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్ల కంటే తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలకు నేరుగా మందు పిచికారీ చేసే వీలుంటుంది.

పరిమితికి మించి వద్దు

పంటను ఆశించిన తెగుళ్లు, పురుగుల నిర్మూలనకు ఇష్టమొచ్చిన మందులు చల్లితే ఉపయోగం ఉండదు. విష తీవ్రతలో తేడా ఉంటుంది. పిచికారీ చేసేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అస్వస్థతకు గురవుతారు. వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తలు ఫెస్టిసైడ్స్ దుకాణదారులు సూచనలు పాటించాలి. పరిమితికి మించి పంటలకు మందులు పిచికారీ చేస్తే మేలు కన్నా కీడే ఎక్కువగా జరుగుతుంది. జాగ్రత్త వహించకుంటే పంటకు మేలు చేసే సాలీడు, అక్షింతల పురుగులు మృత్యువాత పడతాయి. మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు కీడు చేసే పురుగుల ఉధృతి పెరుగుతుంది.

అవగాహన అవసరం

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతుల అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా ఫెస్టిసైడ్ దుకాణాల్లో పురుగుమందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో పుర్రె గుర్తుతో ఉన్న రంగు, ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలుంటాయి. పుర్రె గుర్తుతో కూడి ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో ఉంటే తక్కువ విషపూరితమని తెలుసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పురుగు మందు డబ్బా మూత నోటితో తీయ వద్దు. మందు ద్రావణాన్ని చేతితో కలపద్దు.
- మందు ఒకేసారి సరిపడా కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయ రాదు. పిచికారీ సన్నగా, తుంపరలా ఉండేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి. మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు రాకల పురుగుమందులు కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌస్‌లు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి. చేతి వేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు. పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం గాలి ఎదురుగా వచ్చేటప్పుడు పురుగుమందు పిచికారీ చేయకూడదు. గాలి వీస్తున్న వైపే వెళ్తూ పిచికారీ చేయాలి.
- పురుగుమందు పిచికారీ చేసే సమయంలో పొగ తాగరాదు. పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తిన వద్దు. చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుచుకోవడం లాంటి పనులు అస్సలు చేయొద్దు.
- పంట ఏపుగా పెరిగి ఉంటే చేతిపంపుతో కాకుండా స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి.
- కొన్ని రకాల పురుగుమందులు మాత్రం పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయకూడదు. స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే మందు గాలిలో కలిసి ఇతర పంట లపై పడితే పంట నాశనమై పోతుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి.
- గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయరాదు. పిచికారీ పూర్తియిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తలస్నానం చేయాలి.
- పిచికారీ చేసేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులు మాత్రమే ధరించాలి. వాటిని విడిచిన తర్వాత మిగతా దుస్తులతో కలిపి శుభ్రం చేయొద్దు.
- చిన్నపిల్లలకు పురుగుమందులను సాధ్యమైనంత దూరంగా ఉంచేలా జాగ్రత్త పడాలి.
- పిచికారీ అనంతరం వినియోగించిన పురుగు మందు డబ్బాలను గోతి తీసి పాతిపెట్టాలి.

పాలనురగల 'కోర్టికల్'



ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నేరడిగొండ మండలంలోని కోర్టికల్ జలపాతం జలకళను సంతరించుకుంది. పాలనురగలను తలపించేలా నీరు ప్రవహిస్తూ పర్యాటకులను పరవశింపజేస్తోంది. జాతీయ రహదారి 44 సమీపంలోనే ఉండడంతో ఇటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలను ఆకట్టుకుంటోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసరలో 'శ్రావణ' సందడి

బాసర: బాసరలో 'శ్రావణ' సందడి మొదలైంది. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం సరస్వతీ, మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేకువజామున వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి నిత్య అభిషేకం, హారతి, గణపతి పూజ, కలశపూజ, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులతో



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అక్షరాభ్యాసం చేయించారు. కుంకుమార్చన పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో 'ఎక్సైజ్' గ్రామసభలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉట్నూర్, లింగోజీతండా, లక్కారం, హర్కాపూర్ గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. పరిశీలకులుగా మెస్రం మనోహర్, ఏటీడీవో క్రాంతి వ్యవహరించారు. ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామపంచాయతీల్లో వైన్‌షాపుల ఏర్పాటుకు తీర్మానాలు చేసినట్లు ప్రత్యేక పరిశీలనాధికారి మనోహర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది ఏజెన్సీ గ్రామాలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు గ్రామాలను కలుపుకొని 14 గ్రామపంచాయతీల్లో ఈ నెల 25, 26 తేదీల్లో



మాట్లాడుతున్న ప్రత్యేక పరిశీలనాధికారి మనోహర్

గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఉట్నూర్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రూప్‌సింగ్, ఎస్సై కష్ణకుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవగాహన

బాసర: బాసర ఆర్జీయూకేటీలో నూతన ఆవిష్కరణల పరిరక్షణకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా 'అవగాహన మేధస్సుకు రక్షణ' అనే అంశంపై కళాశాల అధికారులు ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పేటెంట్ దాఖలాలు, కాపీరైట్స్, డిజైన్ రిజిస్ట్రేషన్, పేటెంట్ డ్రాఫ్టింగ్ తదితర ముఖ్యాంశాలపై డాక్టర్ దాసరి అయోధ్య వివరించారు. డాక్టర్ సాజిబ్ కేపీ పాల్ మాట్లాడుతూ.. మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్), భారతదేశ ఐపీ చట్టాలు, ఐపీఆర్ ప్రధాన విభాగాల గురించి తెలిపారు. సమాచారం, దరఖాస్తు ఫారాల రకాలు, దరఖాస్తును వేగంగా ప్రాసెస్ చేసుకునే వ్యూహాలు, ఫీజు నిర్మాణాల గురించి వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేటెంట్ల కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేయాలో తెలిపారు. పేటెంట్ శోధనలు ఎలా నిర్వహించాలో మార్గనిర్దేశం చేశారు. డ్రాయింగ్, సాంకేతికంగా ఎలా రాయాలో, ఎలా రూపొందించాలో అవగాహన కల్పించారు. భారతదేశం డబ్ల్యూటీవో (ప్రపంచ వాణిజ్య సంస్థ) స్థాపక సభ్యులుగా ఉన్నప్పటికీ దేశంలోని చాలా విశ్వ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

విద్యాలయాల్లో ట్రేడ్, ఆవిష్కరణలపై ప్రత్యేక కోర్సులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉత్పత్తులకు మార్కెట్లో గుర్తింపు లేని దుస్థితి ఉందని తెలిపారు. సెమీ కండక్టర్ ఉత్పత్తుల ప్రాధాన్యత, ఫ్యాన్సీ ఐస్‌క్రీమ్‌లు, కుకీస్ ప్యాకేజింగ్ మార్కెటింగ్, ఐపోస్, అలెక్సా ఆధారిత హోటల్, స్మార్ట్ లైటింగ్ లాంటి అనేక వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. త్వరలో విశ్వవిద్యాలయంలో ఇంక్యూబేషన్ సెంటర్ ప్రారంభించనున్నట్లు కళాశాల వీసీ గోవర్ధన్ ప్రకటించారు. 'ఉత్పత్తుల అభివృద్ధి, మార్పుల ఆవశ్యకతలు, మార్కెట్ డిమాండ్లను గమనిస్తూ మార్పులు చేయగల సామర్థ్యం కలిగిన మేధావులను సిద్ధం చేయాలని సూచించారు. అసోసియేట్ డీన్‌లు డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, కోఆర్డినేటర్ డాక్టర్ కాశన్న, సభ్యులు డాక్టర్ అజయ్ రెవెల్లి, డాక్టర్ రాకేశ్ రోషన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన బాలెరావ్ కపిల్ (26) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీస్ ఇన్‌చార్జి ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కపిల్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, గతేడాది భార్యకు విడాకులిచ్చాడు. మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో కుటుంబీకులు గురువారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన కపిల్ తిరిగి రానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతడి కోసం చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించలేదు. రాత్రి 12.15 గంటలకు ఆర్టీవో కార్యాలయం ఎదుట గల రైల్వే ట్రాక్‌పై పూర్ణ నుంచి ఆదిలాబాద్‌కు వచ్చే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు.

దేగామలో పురుగుల మందు తాగి..

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగల శ్రీనివాస్–లక్ష్మి కుమారుడు నిఖిల్ (22) బోథ్ మండలాని



నిఖిల్ (ఫైల్)

కి చెందిన యువతిని ప్రేమించాడు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన నిఖిల్ ఈనెల 20న రాత్రి తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు నిఖిల్‌ను ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో చోరీ

జన్నారం: మండల కేంద్రంలోని కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరగగా, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై అనూష తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు శుక్రవారం ఆలయ పూజారి రేగుంట భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై అనూష కేసు నమోదు చేశారు. పోలీసులు నాలుగు బృందాలుగా వీడి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, మూడు గంటల్లోనే నిందితుడిని గుర్తించారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన కొండపల్లి అశోక్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మూడు గంటల్లోనే కేసు ఛేదించిన



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

సీఐ రమణమూర్తిని, ఎస్సై అనూష, కానిస్టేబుళ్లు తుకారాం, సంతోష్, శ్రీనివాస్‌ను ఏసీపీ ప్రకాశ్, డీసీపీ భాస్కర్ అభినందించారు.

మంత్రి పీఏపై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కార్మికశాఖ మంత్రి వివేక్ పీఏ రమణారావుపై శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుబ్బారావుకు ఫిర్యాదు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో న్యూస్ పేపర్లలో వచ్చిన వార్తలను సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. మంత్రి పీఏగా ఉన్న రమణారావు దళితనేతపై తప్పుడు ప్రచారం చేసినందుకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే రామగుండం సీపీకి ఫిర్యాదు చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు సాంబగౌడ్, మేడ సురేశ్‌రెడ్డి, కొప్పుల రవీందర్, మహేందర్, జడల మల్లేశ్, నాయబ్, బోగె భారతి తదితరులున్నారు.

తేజకల్యాణికి నియామకపత్రం



తేజకల్యాణికి నియామకపత్రం ఇస్తున్న సీతక్క

లక్సెట్టిపేట: పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన కూడెల్లి తేజకల్యాణి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ఐసీడీఎస్ సీడీపీవోగా ఎంపికై శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. తేజకల్యాణి తండ్రి సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి స్వరూపారాణి గృహిణి. తేజకల్యాణి పట్టణంలోని ట్రినిటి పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నారు. కాగజ్‌నగర్‌లోని నవోదయ సీటు రాగా అందులో పదో తరగతి వరకు, హసన్‌పర్తిలో ఇంటర్, హైదరాబాద్‌లో డిగ్రీ, ఎస్‌ఐఎస్‌లో పీజీ పూర్తి చేశారు. తేజకల్యాణిని పలువురు అభినందించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బెల్లంపల్లి: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ వలస కూలీలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహి స్తున్న పనులకు వచ్చారు. ఇందులో రాజ్‌బతి–ప్రేమ్‌లాల్ దంపతులు ఉండగా వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం పిల్లలను ఇంటి వద్ద ఉంచి కాంటా చౌరస్తాలోని మార్కెట్‌కు కూరగాయల కోసం వచ్చారు. వీరి ఐదేళ్ల కుమారుడు సుమిత్ తల్లిదండ్రులను వెతుక్కుంటూ రైల్వేస్టేషన్ ఏరియా నుంచి ఏఎంసీ ఏరియా వరకు వచ్చాడు. తల్లిదండ్రులు కనిపించకపోవడంతో చౌరస్తాలో ఏడుస్తుండగా కొందరు గమనించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు సూచన మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది రామ్‌ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ బైక్‌పై ఆ బాలుడిని ఎక్కించుకుని మున్సిపల్ వార్డులన్నీ కలియదిరిగారు. చివరకు అంబే



బాలుడితో తల్లిదండ్రులు, పోలీసులు

డ్కర్‌నగర్ బస్తీకి వెళ్లగా అప్పటికే ఆ ప్రాంతంలో వెతుకుతున్న అతడి తల్లిదండ్రులు కనిపించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది వలస కూలీలను విచారించి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలు పాటించాలని హైదరాబాద్ రీజియన్–2, సౌత్ సెంట్రల్ జోన్ డైరెక్టర్ ఆఫ్ మైనింగ్ సేఫ్టీ (డీజీఎం, మైనింగ్) నాగేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం ఏరియాలోని ఎల్లందు క్లబ్ ఆవరణలో సింగరేణి సేఫ్టీ జీఎం (కార్పొరేట్) చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రైపాక్షిక రక్షణ సమీక్షకు సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లుతో కలిసి ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ ఏరియాలోని గనుల్లో రక్షణపై వివరించారు. తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డీజీఎం మాట్లాడుతూ.. ఏరియాలో జీరో పర్సంటేజ్ ఆక్సిడెంట్‌గా విధులు నిర్వహించాలని, పని స్థలాల్లో అనుభవజ్ఞులైన వారిని నియమించాలని, ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతో విధులు నిర్వహించేలా చూడాలని సూచించారు. డైరెక్టర్ (పీపీ) మాట్లాడుతూ.. రక్షణపై సింగరేణి పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు రక్షణ సూత్రాలు పాటిస్తూ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం సేఫ్టీ జీఎం (కార్పొరేట్) ప్రమాదాల ని వారణకు చేపడుతున్న చర్యల గురించి వివ



రక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న నాగేశ్వరరావు

రించారు. ఈ సందర్భంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహిస్తామని రక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ఏరియాలో ప్రమాదాల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. డీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజ్‌కుమార్, డీవై డీఎంఎస్ (మెకానికల్) రాజీవ్ ఓంప్రకాశ్‌వర్మ, డీవై డీఎంఎస్ (మెకానిక్) దిలీప్‌కుమార్, డీవై డీఎంఎస్ (మైనింగ్) ప్రేమ్‌కుమార్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్‌చౌదరి, డీవై డీఎంఎస్ (మెకానికల్) అనికేత్‌సింగ్, మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కరరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా స్థాయి అధికారులు, ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేసి న ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లిలోని శివాజీనగర్‌కు చెందిన టేక్లె కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఆయన స్నేహితుడు గైక్వాడ్ కృష్ణ గురువారం ఆదిలాబాద్‌కు తీసుకువచ్చాడు. కృష్ణ భార్య రిమ్స్‌లో డెలివరీ కాగా ఆస్పత్రికి వచ్చిన అతడు బైక్ అక్కడ పార్కింగ్ చేశాడు. ఉదయం బైక్ కనిపించలేదు. దీంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

సాత్నాల: లారీ బైక్‌ను ఢీకొనగా లారీ డ్రైవర్‌పై ఆకుర్ల గ్రామస్తులు దాడికి పా ల్పడ్డారు. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఆదిలా బాద్ నుంచి పట్టి లేజర్ లోడుతో బేలాకు వెళ్తున్న లారీ తర్నం బ్రిడ్జి వద్ద ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆకుర్ల గ్రామానికి చెందిన రాహుల్, పాండురంగకు స్వల్ప గాయాలయ్యాయి. తమ గ్రామస్తులకు గాయాలయ్యాయనే కోపంతో నితీశ్, దత్తు లారీ డ్రైవర్ షేక్ ఫిరోజ్‌పై దాడికి దిగారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు దశాబ్దాలకు భూసమస్య పరిష్కారం

భీమిని: నాలుగు దశాబ్దాలుగా కుటుంబ తగాదాలతో జఠిలంగా మారిన భూసమస్యను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ శుక్రవారం పరిష్కరించారు. వివరాలు.. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామపంచాయతీకి చెందిన తాళ్లపల్లి పోచయ్య–రుక్మబాయికి నలుగురు కుమారులు నానయ్య, శంకర్, రామయ్య, లింగయ్య ఉన్నారు. పోచయ్య పేరిట సు మారు 84 ఎకరాల భూమి ఉంది. పోచయ్య కుమారులకు వివాహాలు కాగా, మనుమలు, మనుమరాళ్లు



పోచయ్య వారసులు, గ్రామస్తులతో ఆర్డీవో హరికృష్ణ

కూడా ఉన్నారు. అయినప్పటికీ కుటుంబ తగాదాలతో భూమి పంపకాలు కాలేదు. ఇటీవల భూభారతిలో పోచయ్య వారసులు వారసత్వ భూములు తమ పేరిట రిజిస్ట్రేషన్లు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేసి సర్వే డిపార్ట్‌మెంట్ వారితో కలిసి మోఖా సర్వే చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. కాగా, పోచయ్య వారసులకు కుటుంబ తగాదాలు ఉండటంతో శుక్రవారం జజ్జరవెల్లి గ్రామపంచాయతీలో కుటుంబ సభ్యులందరి వాంగ్మూలం తీసుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ శ్రవణ్‌కుమర్, డీఐ నజీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీజ విచారణ జరిపించారు. పోచయ్య వారసులందరితో మాట్లాడి భూమి పంపకాలు చేసి సమస్య పరిష్కరించారు.